సాక్షి
జగిత్యాల

మంగళవారం । 6 । జూన్ । 2023



గర్భిణులకు సీమంతం

రాయికల్ : రాయికల్, దావన్‌పల్లి, ఒడ్డెలింగాపూర్‌లో సోమవారం గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు సీమంతం చేశారు.



పెద్దచెరువు పరిశీలన

రాయికల్ : చెరువుల పండుగను పురస్కరించుకుని చేపట్టే వేడుకల కోసం అధికారులు స్థానిక పెద్దచెరువును పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
39.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయవాదులకు అండగా ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి నీలిమ

జగిత్యాలజోన్: జిల్లా కోర్టులోని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ న్యాయవాదులకు అండగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సూచించారు. జిల్లా కోర్టులో సోమవారం అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయాన్ని జడ్జి నీలిమ ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదులతోపాటు కక్షిదారులకు కూడా సేవలు అందించాలని కోరారు. సొసైటీ ద్వారా అమలు చేసే సంక్షేమ ఫలాలు ప్రతీ న్యాయవాదికి అందేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీకి తన అండదండలు ఉంటాయన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు శంకర్, కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. సబ్ జడ్జి కంచ ప్రసాద్, మెజిస్ట్రేట్‌లు జితేందర్, వినిల్‌కుమార్, అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బండ భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి ప్రతాప్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'సీఎం కేసీఆర్ నిజస్వరూపం తెలిసింది'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: తన కూతురు కవితను లిక్కర్ స్కాం నుంచి కాపాడేందుకు సీఎం కేసీఆర్ బీజేపీతో కుమ్మక్కయ్యారని, మోదీ మెప్పు కోసమే కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలుపుతానని నిర్మల్ సభలో వ్యాఖ్యానించడంతో తన నిజస్వరూపం తేటతెల్లమైందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఎవరిని బంగాళాఖాతంలో కలపాలో నాలుగు నెలల్లోనే ప్రజలు తేల్చుతారన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వ నిధులతో పూర్తిచేయాల్సిన ఎన్టీపీసీ పవర్ ప్రాజెక్టును పక్కనపెట్టిన కేసీఆర్.. కమీషన్ల కక్కుర్తి కోసం రూ.40వేల కోట్లతో యాదాద్రి పవర్ ప్రాజెక్టు స్థాపించి ప్రజలపై అప్పుల భారం మోపారని ఆరోపించారు. ఎన్టీపీసీ పూర్తి చేస్తే యాదాద్రి అవసరం ఉండేదికాదని అన్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి జిల్లాకో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, జున్ను రాజేందర్, మన్సూర్, నేహాల్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ లక్ష్యం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రాయికల్(జగిత్యాల): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎఫ్ఆర్వో భూమేశ్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం రాయికల్ నుంచి భూపతిపూర్ గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ వేణు, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రమౌళి, సెక్షన్ ఆఫీసర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లాయర్లకు శిక్షణ

జగిత్యాల : మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో వస్తున్న నూతన చట్టాల గురించి న్యాయవాదులకు మరింతగా అవగాహన కల్పించేందుకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్‌లో సోమవారం జరిగిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జగిత్యాల బార్ అసోసియేషన్ నేతృత్వంలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, మెట్‌పల్లి న్యాయవాదులకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

కేజీబీవీలో ప్రవేశాలు

జగిత్యాల: ధరూర్ క్యాంప్ కేజీబీవీలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు స్పెషల్ ఆఫీసర్ మధులత సోమవారం తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో బైపీసీ, ఎంపీసీ, ఆరో తరగతిలో ఖాళీలను బట్టి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆంగ్లమాధ్యమంలోనే విద్యాబోధన ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 85220 80903 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పంట రుణం రూ.1,270కోట్లు



రుణాల పంపిణీ ప్రారంభం



జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో పంట రుణాల పంపిణీ ప్రారంభమైంది. ఇప్పటికే కొందరు పాత రుణాలు చెల్లించి, కొత్తగా పంట రుణం తీసుకుంటున్నారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీరైతుకు పంట రుణం అందిస్తాం. రైతు పేరిట పట్టాదారు పాస్ బుక్‌లో వ్యవసాయ భూమి ఏ మేరకు ఉంటే, ఆ మేరకు పంట రుణం ఇస్తున్నాం. రుణాల విషయంలో ఎక్కడైనా ఇబ్బందులు కలిగితే మా దృష్టికి తీసుకు రండి. సమస్య పరిష్కరిస్తాం.

– వెంకట్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్

- వానాకాలం రుణ ప్రణాళిక ఖరారు
- గతేడాదికన్నా రూ.122కోట్లు తక్కువ
- రైతులకు ఆసక్తి తగ్గడం కారణం
- జిల్లాలో 23 బ్యాంకుల ద్వారా పంపిణీకి కార్యాచరణ

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం పంట రుణ ప్రణాళిక ఖరారైంది. వ్యవసాయాధారిత జిల్లా అయినా.. గతేడాది ఆశించిన స్థాయిలో రైతులు రుణాలు తీసుకోలేదు. దీంతో ఈసారి రూ.122 కోట్ల లక్ష్యం తగ్గించారు. రైతులకు రూ.1,270 కోట్లు పంట రుణం పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని 23 బ్యాంకు శాఖల ద్వారా రుణాలు అందిస్తారు. ఇప్పటికే 10శాతం వరకు రుణాలు మంజూరు చేశాయి. మరికొందరు పాత రుణ వాయిదాలు చెల్లించి, కొత్త రుణాలు తీసుకుంటున్నారు.

రుణ లక్ష్యం రూ.1,270 కోట్లు..

- జిల్లాలో గ్రామీణ, ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు కలిపి దాదాపు 121 శాఖలు ఉన్నాయి.
- అన్ని బ్యాంకు శాఖలు రైతులకు పంట రుణాలు మంజూరు చేసేలా కలెక్టర్ యాస్మిన్ బాషా, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్‌రెడ్డి లక్ష్యాలు నిర్దేశించారు.
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,53,607 మంది రైతులకు రూ.2,117.97 కోట్ల పంట రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఈ మేరకు వానాకాలంలో 92,164 మందికి రూ.1,270 కోట్లు, యాసంగిలో 61,443 మందికి రూ.847.97 కోట్లు అందించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్దేశించింది.

23 బ్యాంకుల్లో రుణ సౌకర్యం..

జిల్లాలో 10 పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు ఉండగా, వాటి పరిధిలోని 49,497 మంది రైతులకు రూ.681 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. 11 ప్రైవేట్ బ్యాంకులు ఉండగా, వాటి ద్వారా 11,737 మందికి రూ.163 కోట్లు, కో ఆపరేటివ్ బ్యాంకు ద్వారా 21,778 మందికి రూ.300 కోట్లు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా 9,152 మంది రైతులకు రూ.126 కోట్ల రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు.

బ్యాంకుల వారీగా వానాకాలం రుణ లక్ష్యం(రూ.కోట్లలో)

బ్యాంకు	రైతులు	పంట రుణం	బ్యాంకు	రైతులు	పంట రుణం
బ్యాంక్ ఆఫ్ బరోడా	1,824	26.00	సిటీ యూనియన్ బ్యాంక్	271	4.00
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	139	2.00	డీసీబీ	117	2.00
కెనరా బ్యాంక్	5,672	78.00	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4,813	66.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	1,157	16.00	ఐసీఐసీఐ బ్యాంక్	3,081	42.00
ఇండియన్ బ్యాంక్	5,547	77.00	ఐడీబీఐ బ్యాంక్	1,006	14.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	1,165	16.00	ఇండస్‌ఇండ్ బ్యాంక్	61	1.00
పంజాబ్ నేషనల్ బ్యాంక్	305	4.00	కరూర్ వైశ్యాబ్యాంకు	299	4.00
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	15,746	217.00	డీబీఎస్ బ్యాంక్	97	1.00
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	17,814	244.00	జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు	21,778	300.00
యాక్సిస్ బ్యాంక్	1,676	23.00	తెలంగాణ గ్రామీణ బ్యాంకు	9,152	126.00

గోదావరి పవిత్రత పరిరక్షణ లక్ష్యం



ధర్మపురిలోని గోదావరి నదీమతల్లికి మహా హారతి ఇస్తున్న వేద పండితులు

- గోదావరి మహాహారతి వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీధర్‌రావు
- ఘనంగా గోదావరి మహాహారతి

ధర్మపురి: భవిష్యత్‌లో గోదావరి నది పవిత్రతను కాపాడే ప్రభుత్వాలు రావాలని గోదావరి మహాహారతి వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్సాని మురళీధర్‌రావు అన్నారు. ధర్మపురి పుణ్యక్షేత్రం సమీప గోదావరి నదీతీరంలో సోమవారం సాయంత్రం గోదావరిమహా హారతి వైభవంగా నిర్వహించారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ, గోదావరి నది పవిత్రత పరిరక్షణ కోసం 11ఏళ్లుగా ఏటా కార్తీక మాసంలో గోదావరిహారతి చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే తెలంగాణలోని పవిత్రమైన కందకుర్తిలో యాత్ర ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్‌లోని మూసీనది ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో పాలకుండలా కనిపించేదని, ఇప్పుడదది మురుగునదిగా మారిందని ఆవేదన చెందారు. గోదావరి నది అలాకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ధర్మపురిలో గోశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. చండీమాతా ఉపాసకులు పాలెం మనోహర్‌శర్మ, మాజీ ఎంపీ వివేక్, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి లింగంపెల్లి వీరగోపాల్, జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు మధుసూదన్‌రావు, వేద పండితులు పాల్గొన్నారు.

మల్లాపూర్(కోరుట్ల) : నదులను పరిరక్షించేందుకు సమష్టి కృషిగా చేయాలని గోదావరి మహా హారతి వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్సాని మురళీధర్‌రావు కోరారు. మొగిలిపేట, ఒబులాపూర్, సంగెం–శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వాల్గొండ గోదావరి తీరప్రాంతాలను ఆయన సందర్శించారు. నాయకులు సాంబారి ప్రభాకర్, జీఎస్ వెంకట్, జంగిలి సునీత, సురభి నవీన్‌కుమార్, పూదరి నిషాంత్ కార్తికేయ, ముద్దం సత్యనారాయణగౌడ్, పందిరి నాగరాజు, గడ్డం నవీన్‌కుమార్, ఎర్ర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్దీపూర్, వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ తీరాలను మురళీధర్‌రావు సందర్శించారు. రైల్వేబోర్డు మాజీ సభ్యురాలు పూదరి అరుణ, నాయకులు పూదరి నిషత్‌కార్తికేయ, బట్టు జకరయ్య, గడ్డం సంజీవ్, గంగారెడ్డి, బాశెట్టి గణేశ్, రాజేందర్, రాజు, గంగాధర్, దాసరి రాజేందర్, శ్రీనివాస్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సారంగాపూర్(జగిత్యాల): తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేయాలని మురళీధర్‌రావు అన్నారు. బీర్‌పూర్‌లోని బీజేపీ నాయకుడి నివాసంలో కాసేపు ఆగారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి అన్నిఅవకాశాలు ఉన్నాయన్నారు. నాయకులు ఉన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై అదనపు కలెక్టర్ మకరంద్, అధికారులు, ప్రజాప్రతినిధులు

- సీఎం కేసీఆర్ పాలనలోనే నిరంతర విద్యుత్
- విద్యుత్ దినోత్సవంలో మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: 'తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక కరెంట్ కష్టాలు పోయినయి.. సీఎం కేసీఆర్ పాలనలో నిరంతర విద్యుత్ అందుతోంది' అని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ దినోత్సవం నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలు ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రతిపక్షాలు, గిట్టనివారు తమ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులు పండించిన ధాన్యాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. కొందరు మోసగాళ్లు రైతుల ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల ఓ రైతు ధాన్యం కొనలేదని ఏకంగా క్యాంపు కార్యాలయం ఎదుట ధాన్యం పోసి నిరసన తెలపడం వెనుక కుట్రదారుల హస్తం ఉంటుందని ఆరోపించారు. ధాన్యం పోయాల్సింది కొనుగోలు కేంద్రాల వద్ద కానీ కార్యాలయాల ఎదుట కాదన్నారు. అంతకుముందు రాయపట్నం గ్రామానికి చెందిన కలమడుగు వినోద్‌కుమార్ వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండు కింద రూ.1.90 లక్షల విలువైన చెక్కును మంత్రి అందజేశారు. నేరెళ్ల ఎంపీటీసీ రెడ్డవేని సత్యం తండ్రి మృతి చెందడంతో ఆయన కటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీలు చిట్టిబాబు, కరుణశ్రీ, జెడ్పీటీసీ బత్తిని అరుణ, పద్మజ ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, ఏడీఈ సింధూర్‌శర్మ, ఏడీ రాజబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే నిరంతర విద్యుత్



పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు
- మెట్‌పల్లిలో ఘనంగా విద్యుత్ దినోత్సవం

మెట్‌పల్లి(కోరుట్ల): వ్యవసాయ, గృహావసరాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వెల్లుల్ల కేఎస్‌రెడ్డి గార్డెన్‌లో సోమవారం నియోజకవర్గస్థాయి విద్యుత్ దినోత్సవం నిర్వహించారు. విద్యాసాగర్‌రావుతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ హాజరయ్యారు. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే రాష్ట్రం అంధకారమవుతుందని ఆంధ్రా పాలకులు ఎద్దేవా చేశారన్నారు. కానీ సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన సంస్కరణలతో నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి 24గంటల పాటు ఉచితంగా కరెంట్ అందిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నామని అన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో మెరుగైన విద్యుత్ సరఫరా కోసం రూ.100కోట్లతో 16చోట్ల ఉపకేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అవసరమైన చోట కొత్తగా సబ్‌స్టేషన్లను నెలకొల్పామని అన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారన్నారు. అంతకుముందు విద్యుత్ సంస్థ విజయగాథ పుస్తకం ఆవిష్కరించారు. ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్లు రాణవేని సుజాత, అన్నం లావణ్య, ఎంపీపీ మారు సాయిరెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల పాలనలో గణనీయమైన అభివృద్ధి



మాట్లాడుతున్న సునీల్ భన్సల్

కోరుట్ల: తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో దేశం అన్నిరంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ భన్సల్ అన్నారు. పట్టణ శివారులో సోమవారం నిజామాబాద్ పార్లమెంటరీ సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ప్రతినిధులు ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, ఎరువుల రాయితీ, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రతీ రైతు ఎకరాకు రూ.35వేల చొప్పున లబ్ధి పొందుతున్నాడని, ఇది కేంద్రప్రభుత్వం అందిస్తున్న సాయానికి నిదర్శనమన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి కేంద్రం రూ.2.45లక్షలు మంజూరు చేస్తే.. రాష్ట్రప్రభుత్వం ఆ నిధులు ఏం చేసిందో తెలియడం లేదని దుయ్యబట్టారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో పట్టణాల్లో వంద శాతం మరుగుదొడ్లు కట్టించామని తెలిపారు.

పోరుబాటలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

- క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడికి నిర్ణయం
- ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్

కథలాపూర్(వేములవాడ): విద్యాశాఖకు అనుబంధంగా సేవలు అందిస్తూ, మండల, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్లుగా ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు క్రమబద్ధీకరణపై ఎంతోఆశతో ఉన్నారు. కానీ, ప్రభుత్వం రెగ్యులరైజేషన్‌పై జాప్యం చేయడంతో పోరు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సుమారు 15 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. ఎప్పటికైనా తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరిస్తారనే ఆశతో ఇన్నాళ్లూ నెట్టుకొస్తున్నారు.

జిల్లాలో ఉద్యోగులు 160 మంది..

- జిల్లాలోని సమగ్ర శిక్షాలో బోధన, బోధనేతర సిబ్బంది స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా, ఎమ్మార్సీల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లుగా, సీసీవోలుగా, మెస్సెంజర్లుగా, భవిత కేంద్రాల్లో ఐఈఆర్‌పీగా, పాఠశాలస్థాయిలో పీటీఐగా, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏపీవోగా, సిస్టమ్ అనలసిస్ట్‌గా, డీపీవో ఆపరేటర్‌గా, అటెండర్‌గా వివిధ హోదాల్లో 160 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.
- విద్యాశాఖలో కీలకంగా ఉంటూ పాఠశాలల్లోని సమాచారాన్ని సేకరించి మండల విద్యాశాఖకు తెలియజేయడం, అక్కడి నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరవేయడంలో వీరిదే కీలకపాత్ర.
- వీరిని విధుల్లోకి తీసుకునే సమయంలో రోస్టర్, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారమే ఎంపిక చేశారు.
- విధి నిర్వహణలో ఒత్తిడి ఉన్నా.. తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరిస్తారనే ఆశతో విధులు నిర్వర్తిస్తున్నారు.
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి క్రమబద్ధీకరణ ప్రారంభమవుతుందని మంత్రి హరీశ్‌రావు ప్రకటించినా.. నేటికీ అమలు కావడంలేదని వారు వాపోతున్నారు.



సమావేశమైన సమగ్ర శిక్షా ఉద్యోగులు(ఫైల్)

జిల్లా సమాచారం	
డాటా ఆపరేటర్లు	03
టెక్నికల్ పర్సన్	01
ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు	14
సీసీవోలు	13
సీఆర్‌పీలు	71
పీటీఐలు	78

రెగ్యులరైజ్ చేయండి



జీవో ప్రకారం సమగ్ర శిక్షాలో మమ్మల్నీ ఎంపిక చేశారు. సుమారు 15 ఏళ్లుగా ఎమ్మార్సీలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న. విద్యాశాఖలో కొత్త పథకాలు పక్కాగా అమలు చేస్తున్నాం. ఏళ్లుగా పనిచేస్తున్నం. మా ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి. అప్పుడే మాకు న్యాయం జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలి. రూ.5 లక్షల వరకు ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలి.

– వేముల గంగరాజం, సమగ్ర శిక్షా ఉద్యోగి, కథలాపూర్

ఉద్యోగ భద్రత కల్పించాలి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మా ఉద్యోగాలకు భరోసాగా ఉంటుందనుకున్నం. ఏళ్లుగా విద్యాశాఖకు అనుబంధంగా పనిచేస్తున్నా.. వేతనాల విషయంలో వెట్టిచాకిరే. మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించి పే స్కేల్ అమలు చేయాలె. ఉద్యోగ భద్రత కల్పించాలె. ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇస్తే మా కుటుంబాలకు అండగా ఉంటుంది.

– కుడుకల రవీందర్, సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా ప్రధానకార్యదర్శి

క్రమబద్ధీకరించాలి

జగిత్యాల: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆయనకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాజు మాట్లాడుతూ, తెలంగాణ సమగ్ర శిక్షా, కేజీబీవీ, యూఆర్ఎస్, బోధన, బోధనేతర విభాగాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వారు విద్యాభివృద్ధికి శక్తికి మించి కృషి చేస్తున్నారని అన్నారు. వెంటనే వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జగిత్యాల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సఖీ కేంద్రం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. జడ్జి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సఖీ కేంద్రానికి డీఎల్ఎస్ఏ సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమాధికారి నరేశ్, సామాజికవేత్త రాజ్‌గోపాలాచారి, సఖీ నిర్వాహకురాలు మనీల, లావణ్య పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి



ఎమ్మెల్యే రవిశంకర్, ప్రజాప్రతినిధులతో సమావేశమైన వినోద్‌కుమార్

మల్యాల: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈనెల 21న కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం నిర్వహించే బహిరంగ సభకు పెద్దఎత్తున ప్రజలను తరలించి, విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జెడ్పీటీసీ కొండపలకల రాం మోహన్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, ఇతర మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై కేసు

మానకొండూర్: మండలంలోని వేగురుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంరాజయ్య, అతడి భార్య పద్మపై కేసు నమోదు అయినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. వేగురుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ దాసరి మమత సోమవారం బాడి బాట కార్యక్రమంలో పాల్గొంది. ఈక్రమంలో మమత బడిబాటలో పాల్గొన్న ఫొటోలను పద్మ తీసి రాంరాజయ్యకు పంపించగా వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. కాగా తన ఫొటోలు పోస్టు చేసి అవమాన పరిచారని, అడిగితే ఇష్టం వచ్చినట్లు ఇరువురు బూతులు తిట్టారని మమత ఫిర్యాదు చేయగా, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇటుకబట్టీలపై విచారణకు లోకాయుక్త ఆదేశం?

పెద్దపల్లిరూరల్: పర్యావరణానికి హాని కలిగిస్తూ జన జీవనాన్ని అతలాకుతలం చేస్తూ ఇటుకబట్టీల మాఫియా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌కు చెందిన బాలసాని వెంకటేశం 2021లో లోకాయుక్తను ఆశ్రయించారు. దీనిపై లోతైన విచారణ చేపట్టేందుకు ఆదేశాలివ్వగా సోమవారం అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచారం. రెండేళ్లుగా ఫిర్యాదుపై సంబంధిత అధికారులు ఇచ్చిన వివరణలను పరిశీలిస్తూ వాయిదాలు వేస్తూ వచ్చింది. రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్, ఇండస్ట్రియల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఇచ్చిన వివరణలపై అభ్యంతరం వ్యక్తం చేసిన లోకాయుక్త నేరుగా పరిశీలించి, విచారణ చేపట్టి, రిపోర్ట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ : రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన వేణుగోపాల స్వామివారి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలు, నీరాజనం, మంత్రపూర్ణం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఈనెల 9న స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే కల్యాణోత్సవం ఈనెల 9న ఏకాంతసేవతో ముగుస్తాయని పేర్కొన్నారు.

38 మందికి లుక్ అవుట్ నోటీసులు

- నేరాలకు పాల్పడి విదేశాలకు వెళ్లిన వైనం
- స్వదేశం రాగానే అరెస్టుకు సిద్ధం
- ఇమిగ్రేషన్ సహాయంతో నిందితుల గుర్తింపు
- పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసుల ప్రత్యేక చర్యలు



హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ సెంటర్

జగిత్యాల క్రైం: స్వరాష్ట్రంలో నేరాలు చేసి ఇతర దేశాలకు పోలీసుల కళ్లు గప్పి పారిపోయిన నేరస్తులపై కోర్టుల్లో దీర్ఘకాలికంగా కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. వీటి పరిష్కారం కోసం విదేశాల్లో ఉన్న నేరస్తులపై జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. నేరాలు చేసి ఇతర దేశాలకు వెళ్లిన నేరస్తులపై ప్రత్యేక నిఘాపెట్టి వారిపై లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీఎస్) జారీచేశారు. నేరస్తులు తిరిగి స్వదేశానికి వస్తున్న సమయంలో ఇమిగ్రేషన్ వారి సహాయంతో నేరస్తులను పట్టుకొని అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తున్నారు. తిరిగి బెయిల్‌పై విడుదలయ్యేటప్పుడు స్థానికంగా ఉన్న వారి షూరిటీతో కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

జిల్లాలో ఇప్పటివరకు నేరం చేసి ఇతర దేశాలకు పారిపోయిన 38 మంది నేరస్తులపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీచేశారు. 2022లో 32 మందిపై లుక్ అవుట్ నోటీసులు జారీచేయగా, 2023లో జనవరి నుంచి ఇప్పటివరకు ఆరు లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు. వివిధ కేసుల్లో ఎన్‌బీడబ్ల్యూఎస్ జారీచేసి నేరస్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 38 మంది నేరస్తులను పట్టుకునేందుకు ఇమిగ్రేషన్ సెంటర్లకు ఇప్పటికే పోలీసులు సమాచారం అందించారు. జిల్లావ్యాప్తంగా వివిధ కేసుల్లో కోర్టుకు హాజరుకాని నేరస్తులను గుర్తించి వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

సత్వర కేసుల పరిష్కారానికి వారెంట్లు జారీ

జిల్లావ్యాప్తంగా దీర్ఘకాలికంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయశాఖ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పలు కేసుల్లో నేరస్తులుగా ఉండి కోర్టుకు హాజరుకాక తప్పించుకొని తిరుగుతున్న వారందరికీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ ఇష్యూ చేసి పోలీసులకు జాబితా అందజేస్తున్నారు. దీంతో పోలీసులు కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న వారి జాబితా సిద్ధంచేసి జిల్లా ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నేరస్తులను పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తూ కేసుల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు.

ఇమిగ్రేషన్ సెంటర్లలో నేరస్తుల జాబితా

కోర్టుల్లో ఉన్న కేసులకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నేరస్తులను పట్టుకునేందుకు లుక్ అవుట్ సర్క్యులర్ ద్వారా నేరస్తుల వివరాలు సేకరించి వారి పేరు, అడ్రస్, పాస్‌పోర్టు నంబరు, ఇతర వివరాలను హైదరాబాద్, ముంబాయ్‌తో పాటు ఇతర నగరాల్లో ఉన్న విమానశ్రయాల్లోని ఇమిగ్రేషన్ సెంటర్లకు సమాచారం అందజేస్తారు. వీరు స్వదేశానికి చేరుకోగానే ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఇమిగ్రేషన్ వారు నేరస్తులను గుర్తించి లుక్ అవుట్ సర్క్యులర్ జారీచేసిన పోలీసులకు సమాచారం అందిస్తారు. వీరు అక్కడికి చేరుకుని నేరస్తులను కోర్టుల్లో హాజరుపరుస్తారు. దీంతో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే దిశగా పోలీసులు కృషిచేస్తున్నారు.

లుక్ అవుట్ నోటీసులు	
2022 :	32 నోటీసులు జారీ
2023 :	ఇప్పటివరకు 6 నోటీసులు జారీ

పెండింగ్ కేసులు పరిష్కారమవుతాయి



జిల్లాలో నేరానికి పాల్పడి ఇతర దేశాలకు వెళ్లిన 38 మంది నేరస్తులపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీచేశాం. వీరు స్వదేశానికి రాగానే ఇమిగ్రేషన్ వారు గుర్తించి పోలీసులకు అప్పగిస్తారు. నేరస్తులను పట్టుకొని కోర్టులో హాజరుపర్చడంతో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమవుతాయి. – ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

తీరని లారీల కొరత



మ్యాదారం తండాలో తూకం వేసిన ధాన్యం నిల్వలు

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- రైస్‌మిల్లుల్లోనూ స్థలం కొరత
- అన్‌లోడ్ చేసుకునేందుకు మిల్లర్ల నిరాకరణ
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ఇంకాపూర్తి కాలేదు. రోహిణి కార్తె చివరి దశకు చేరినా.. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం అలాగే ఉండిపోయింది. రైస్‌మిల్లులకు తరలించడానికి లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వలు పెరిగిపోతున్నాయి. రంగాపేటలో 1,500 బస్తాలు, ఒడ్డెరకాలనీలో 700 సంచులు, మ్యాదారంతండాలో 3వేల సంచులు, లచ్చక్కపేటలో 2,500 సంచులు, భీంరెడ్డిగూడెంలో 4,500 సంచులు, పోతారంలో 4500 సంచులు, అర్పపల్లిలో 4,500 బస్తాలు, కోనాపూర్‌లో 4వేల బస్తాలు, లచ్చనాయక్‌తండాలో 3వేల సంచులు, రేచపల్లిలో 6వేల సంచుల్లోని ధాన్యం మిల్లలకు తరలించాల్సి ఉంది. అయితే, సారంగాపూర్ మండలానికి కేటాయించిన మిల్లులు పూర్తిగా ధాన్యం నిల్వలతో నిండిపోయాయని, కేవలం జగిత్యాల రూరల్ మండలం తక్కల్లపల్లిలో కొత్తగా ప్రారంభమైన మిల్లుతోపాటు, వెల్గటూర్‌లోని ఒక మిల్లు మాత్రమే ధాన్యం అన్‌లోడ్ చేసుకుంటోందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. వెల్గటూర్ మిల్లు యాజమాన్యం కూడా ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడానికి నిరాకరించడంతో సంచీపై 3 నుంచి 4 కిలోలు అదనంగా తీసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ రెండు మిల్లుల ఎదుట సుమారు 40కి పైగా లారీలు కేంద్రాల నుంచి ధాన్యం లోడ్‌తో వెళ్లి క్యూలో నిరీక్షిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: ఉప సర్పంచ్‌పై దాడిచేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ గంగారెడ్డిపై అదే గ్రామానికి చెందిన రేవంత్‌రెడ్డి సోమవారం దాడిచేశాడు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ భూపతిరెడ్డి ఉపసర్పంచ్ మధ్య గొడవ జరుగుతుండగా సర్పంచ్ కుమారుడు రేవంత్‌రెడ్డి గంగారెడ్డిపై దాడిచేయగా అతడికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్నేహితుడిని చంపిన ముగ్గురికి యావజ్జీవ శిక్ష

జగిత్యాల జోన్: స్నేహితుడిని చంపిన ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమా సోమవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు శ్రీవాణి, జంగిలి మల్లికార్జున్ తెలిపిన ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేటకు చెందిన నూనె సమ్మక్క బోళ్లు విక్రయిస్తూ జీనవం గడుపుతుంది. సమ్మక్కకు నలుగురు కుమారులు కాగా రెండో కొడుకు తిరుపతికి, మల్యాల క్రాస్ రోడ్డుకు చెందిన పన్నాటి శ్రీను, మల్యాల మండల కేంద్రానికి చెందిన మిట్టపెల్లి రమణ, దూస అశోక్, రుద్రోజు రాంమోహన్ స్నేహితులు. 2017 జనవరి 1న వీరంతా విందు చేసుకున్నారు. పాత కక్షలతో తిరుపతిపై స్నేహితులు దాడిచేసి బంగ్లాపై నుంచి తోసేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జనవరి 3, 2017 రోజున తిరుపతి మృతిచెందాడు. దీనిపై మృతుడి తల్లి సమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అప్పటి సీఐ, ప్రస్తుత డీఎస్పీ కృపాకర్ కేసు దర్యాప్తు చేశారు. ఈ మేరకు నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ బృంద సభ్యులు రాజునాయక్, ఎం.కిరణ్‌కుమార్, కె.వీ సాగర్ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. దీంతో మిట్టపెల్లి రమణ, దూస అశోక్, రుద్రోజు రామ్మోహన్‌కు యావజ్జీవ శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న పన్నాటి శ్రీను కేసు విచారణ సమయంలోనే మృతిచెందడంతో కేసు తొలగించారు.

అన్నను చంపిన తమ్ముడు

బుగ్గారం: నిద్రిస్తున్న అన్నపై రోకలి బండతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బుగ్గారం మండలం చిన్నాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఇడగొట్టు తిరుపతి (45), ఇడగొట్టు శ్రీనివాస్ అన్నదమ్ములు. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. 2015లో తిరుపతి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. దీంతో కేసుపై రాజీకి రావాలని శ్రీనివాస్ తిరుపతిని కోరాడు. అందుకు తిరుపతి నిరాకరించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు మరింత ముదిరాయి. ఆదివారం తిరుపతి తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో శ్రీనివాస్ రోకలి బండతో అన్నపై దాడిచేశాడు. దీంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.



తిరుపతి మృతదేహం

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్ పరీక్ష–2024కు ఉచిత భోజన వసతితో బంజారాహిల్స్ హైదరాబాద్ నందు శిక్షణ పొందేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా, పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి జూలై 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష జూలై 9న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. www.trrtudycirce.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పంపించాలని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదని, ఈ సంవత్సరం(2023–24) ఏ కళాశాలలోనైనా, ఏదైనా కోర్సు చదువుతున్న వారు లేదా ఉద్యోగం చేస్తున్నవారు అనర్హులని తెలిపారు. గతంలో ఇందులో గానీ మరే ఇతర ప్రభుత్వ సంస్థలో గానీ ఇలాంటి కోచింగ్ తీసుకున్నవారు అనర్హులని, అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆబ్జెక్టివ్ టైప్ ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 040–23546552 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, వసతుల కల్పన, ఉచిత పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. సోమవారం పట్టణంలోని వెంకంపేట పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఏ రమేశ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్లూరి రాజు పాఠశాల ఎస్ఎంసీ చైర్ పర్సన్ వీరబత్తిని కమలాకర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాలాస మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బడిబాటలో పాల్గొన్న డీఈవో రమేశ్‌కుమార్

నెహ్రూనగర్‌లో..

బడిబాటలో భాగంగా నెహ్రూనగర్‌లో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఎస్ఎంసీ చైర్మన్ నరేశ్, సభ్యులు మేరుగు రేఖ, ఉపాధ్యాయులు లచ్చయ్య, పరమేశ్, రాజశేఖర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్షణాల్లో ఘోరం.. అమ్మతనానికి దూరం

- ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్కూటీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- తీవ్రంగా గాయపడి, భర్త చేతిలోనే ప్రాణాలు వదిలిన గర్భిణి
- ఎన్టీపీసీ క్రషర్‌నగర్ వద్ద ఘటన



భర్త క్రాంతితో నిహారిక (ఫైల్)

జ్యోతినగర్ (రామగుండం): మాటలకందని విషాదం.. మరికొన్ని రోజుల్లో ప్రసవం జరిగి, ఆ ఇంట్లోకి శిశువు రానుందన్న వారి ఆనందాన్ని రోడ్డు ప్రమాదం క్షణాల్లో తీసుకెళ్లిపోయింది. కారు రూపంలో వచ్చిన మృత్యువు ఓ గర్భిణిని కబళించింది. భర్తతో కలిసి స్కూటీపై వెళ్తున్న ఆమెను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గర్భిణి తీవ్రంగా గాయపడి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన నిహారిక, రామగుండం మండలంలోని మల్యాలపల్లెకు చెందిన కత్తెరమల్ల క్రాంతి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె ఓ మెగా మార్కెట్‌లో పని చేస్తోంది. ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. ఆధార్ అప్‌డేట్ కోసం భర్తతో సోమవారం స్కూటీపై ఎన్టీపీసీ రామగుండం వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తుండగా క్రషర్‌నగర్ రాజీవ్ రహదారిపై పెద్దపల్లి వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నిహారికను గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కడుపులో ఉన్న శిశువు కళ్లు తెరవకుండానే ప్రాణాలు విడిచింది. కొన్ని నిమిషాల్లో ఇంటికి చేరేవారని, ఈలోగా ఇంత ఘోరం జరిగిందంటూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రిలో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి, మృతురాలి భర్త నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





భార్యను కాపాడుకునేందుకు భర్త ఆరాటం, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



బాధితులను పరామర్శిస్తున్న మక్కాన్‌సింగ్

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ..

పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్ గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో నిహారిక మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ఫకృద్దీన్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, రామగుండం పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శిరిషెట్టి సతీశ్, మద్ది తిరుపతి గౌడ్, బరుపాటి శ్రీనివాస్ తదితరులున్నారు.

గోదావరినదిలో మొసలి పిల్ల ప్రత్యక్షం



నదిలో నీరు తగ్గి, కనిపిస్తున్న ఇసుక

రామగుండం: గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో అంతర్గాం–మంచిర్యాల మధ్య ఉన్న గోదావరినదిలో వరద నీటి మట్టం తగ్గిపోయి, ఇసుక తిన్నెలు దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నది మధ్యలో ఇసుక తిన్నెలపై ఉన్న గడ్డి పొదల్లో మొసలి పిల్ల కనిపించిందని కొంతమంది తెలిపారు. పెద్ద మొసలి కూడా ఇదే ప్రాంతంలో ఉంటుందని అనుమానిస్తున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద జాలర్లు మొసలిని గుర్తించిన విషయం తెలిసిందే. పుణ్యస్నానాల నిమిత్తం గోదావరినదికి వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై సుధాకర్

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు తప్పదని జగిత్యాల రూరల్ ఎస్సై సుధాకర్ అన్నారు. సోమవారం రాత్రి జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ బైపాస్‌రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, నంబరు ప్లేట్ లేని ఆరు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. వాహనదారులకు హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, ధ్రువపత్రాలు ఉండాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. శ్రీరాములపల్లి శివారులో పేకాటాడుతున్నారన్న సమాచారంతో వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

రుద్రంగి (వేములవాడ): విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇన్‌చార్జ్ సెస్ ఏఈ రాకేశ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగిలో ఆదివారం సాయంత్రం కురిసిన ఈదురు గాలుల వర్షానికి నాగారం చెరువు ఆవరణలోని పంటపొలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా మరో ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లను తగలడంతో జూనియర్ లైన్‌మెన్ పూల్‌సింగ్‌కు విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. తీవ్రగాయాలైన పూల్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గుడ్డ సంచులనే వినియోగించాలి

- ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి
- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



గుడ్డ సంచులు అందిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): పర్యావరణ పరిరక్షణకు గుడ్డ సంచులను ఎక్కువగా వినియోగించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని తన కార్యాలయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, కార్మికులకు గుడ్డ సంచులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు పెరగకపోతే సరైన ఆక్సిజన్‌ను పొందలేమని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోతే నీటి కష్టాలు వస్తాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు సింగరేణి యాజమాన్యం ఏటా లక్షలాది మొక్కలు నాటిస్తోందని తెలిపారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు సవిత, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం సలీం తదితరులు పాల్గొన్నారు.